సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

గురువారం 25 జూలై 2024



టన్ను చీనీ రూ.17 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు పలికాయి. మార్కెట్‌కు 1,185 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.40

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.8°/22.6°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో తుంపర్లు పడ్డాయి. గంటకు 10 నుంచి 18 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

మహిళా పోలీసులకు అండగా ఉంటాం

- ఎస్పీ రత్న



ఎస్పీ రత్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహిళా పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని మహిళా పోలీసులకు అన్ని విధాలా అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ రత్న హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన రత్నను మహిళా పోలీసుల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షురాలు ఎం వీ భవాని (అమడగూరు మండలం) ధర్మవరానికి చెందిన మహిళా పోలీస్ కృష్ణవేణి ఆధ్వర్యంలో పలువురు మహిళా పోలీసులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీకి వివరించారు. స్పందించిన ఎస్పీ... త్వరలోనే మహిళా పోలీసులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

రైల్వే ట్రాక్‌పై ఇనుప దూలం కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులను చూపుతున్న రైల్వే సీఐలు

ధర్మవరం అర్బన్/ ధర్మవరం రూరల్: పట్టణంలోని గాంధీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఇనుప దూలం పెట్టిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆర్పీఎఫ్ సీఐ బోయ కుమార్, జీఆర్పీ సీఐ నాగరాజు తెలిపారు. బుధవారం రాత్రి స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు తెలిపారు. పట్టణానికి చెందిన గాడే ఓబులేసు, గీతా నగర్‌కు చెందిన శివకుమార్ రోజూ రైల్వే ట్రాక్ వద్దకు వచ్చి మద్యం సేవించేవారు. ఆ మత్తులో ట్రాక్‌పై ఇనుప ముక్కలు, రాళ్లు పెట్టేవారు. ఒక్కోసారి రైళ్లపై రాళ్లు విసురుతూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించేవారు. ఈ క్రమంలోనే జూన్ 18వ తేదీన పట్టణంలోని గాంధీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద మద్యం సేవించారు. అనంతరం సమీపంలోని పాడుబడ్డ ఇంట్లో ఇనుప దూలం కనిపించగా... దాన్ని తీసుకువచ్చి రైల్వే ట్రాక్‌పై పెట్టేందుకు ప్రయత్నించారు. అయితే సమీపంలోనే రైలు రావడాన్ని గమనించి దూలాన్ని పడేసి వెళ్లిపోయారు. వాస్తవానికి ఇనుపదూలంపై రైలు వెళ్లిపోయాక దాన్ని గుజిరీకి వేసి విక్రయించవచ్చని భావించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న గాడే ఓబులేసు, శివకుమార్‌ను అదుపులోనికి తీసుకుని విచారించగా, వారు నేరం ఒప్పుకున్నారని సీఐలు తెలిపారు. ఇందులో ఎలాంటి కుట్రకోణం లేదని, కేవలం తాగుడుకు బానిసలైన నిందితులు మద్యం మత్తులో ఈ ఘటనకు పాల్పడ్డారని సీఐలు తెలిపారు.

27న సబ్ జూనియర్ షూటింగ్ బాల్ జట్టు ఎంపిక

ధర్మవరం అర్బన్: త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించే జిల్లా జట్టును ఈ నెల 27న ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఇన్‌చార్జ్ జింక ఉదయ్‌కిరణ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరిగే ఈ ఎంపికకు 2008, ఏప్రిల్ 1 తర్వాత జన్మించిన వారు అర్హులు. 94400 41552లో సంప్రదించవచ్చు.

పింఛన్లకు ఎసరు!

- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను తొలగించే కుట్ర
- పంచాయతీల వారీగా జాబితాలు సిద్ధం చేస్తోన్న వైనం
- ఆగస్టు నెల అర్హుల జాబితాలో పేరు లేకుండా చేయాలని అధికారులకు ఆదేశం
- ప్రతి గ్రామంలోనూ 25 శాతం మేర తొలగించాలని 'తమ్ముళ్ల' పన్నాగం
- ఈనెల 28వ తేదీ నాటికి తుది జాబితా సిద్ధం చేయాలని ఆదేశాలు
- 'చెప్పినట్లు చేయండి.. లేదంటే వెళ్లిపోండి' అంటూ అధికారులకు హుకుం

నెల	మంజూరైన పింఛన్లు	పంపిణీ చేయని పింఛన్లు
జూన్	2,73,620	2,736
జూలై	2,70,973	3,046

పింఛన్... ఏ ఆసరాలేని పండుటాకులు, వితంతువులు, దివ్యాంగుల జీవనానికి భరోసా. ఆ మొత్తంతోనే జీవనం సాగించేవారు ఎందరో. అందుకే గత జగన్ సర్కార్ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇంటివద్దనే తంచనుగా 1వ తేదీనే పింఛన్ అందించింది. కానీ రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి సర్కార్ పింఛన్లకు ఎసరు పెట్టింది. వివిధ నియోజకవర్గాల్లోని కూటమి నేతలు కుట్రలు చేస్తూ పింఛన్ల తొలగింపునకు అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఆగస్టు నెల అర్హుల జాబితా నుంచి 25 శాతం మందిని తొలగించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.



సాక్షి, పుట్టపర్తి

అంతా మాదే...అన్నీ మాకే..మేం చెప్పిందే జరగాలంటూ అధికారులపై పెత్తనం చేస్తున్న కూటమి పార్టీల నేతలు కుట్రలకు తెరలేపారు. రాజకీయ కక్షతో పండుటాకులపై పగబట్టి వారి జీవితాలను ప్రశ్నార్థకం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ క్రమంలో అర్హుల జాబితా నుంచి కొందరి పేర్లు తొలగించి పింఛన్ అందకుండా చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందుకోసం ప్రతి సచివాలయ పరిధి నుంచి జాబితాలు సిద్ధం చేసి.. కొన్ని పేర్లను రౌండప్ చేసి.. వాటిని తొలగించాలని హుకుం జారీ చేశారు.

చెప్పింది వినాలి..లేకపోతే వెళ్లిపోండి..

తాము చెప్పినట్లు చేయలేని పక్షంలో విధుల నుంచి తప్పుకోవాలని కూటమి పార్టీల నేతల అధికారులపై జులుం ప్రదర్శిస్తున్నారు. తక్షణమే ప్రతి గ్రామంలోనూ 25 శాతం మేర పింఛన్ అర్హుల పేర్లు జాబితా నుంచి తొలగించాలని ఉద్యోగులపై ఒత్తిడి తెస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులకు పింఛన్ ఇవ్వకూడదని.. తాము చెబితేనే జాబితాలో ఉంచాలని పంచాయతీ, సచివాలయ సిబ్బందితో పాటు ఎంపీడీఓ కార్యాలయం వరకు హుకుం జారీ చేశారు.

మంత్రుల ఇలాకాల్లోనే అధికం..

మంత్రులు ప్రాతినిథ్యం వహిస్తున్న పెనుకొండ, ధర్మవరం నియోజకవర్గాల్లో పింఛన్ జాబితా నుంచి పేర్ల తొలగించాలన్న డిమాండ్ ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామ స్థాయి నుంచి పింఛన్ల తొలగింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు ఆయా గ్రామస్తుల ద్వారా తెలిసింది. కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులనే కారణంతో జాబితా నుంచి పేరు తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని చెబుతున్నారు. పెనుకొండ, రొద్దం మండలాల పరిధిలో చాలా గ్రామాల్లో అధికారులపై టీడీపీ నేతలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా బత్తలపల్లి మండలంలో సుమారు 700 మందికి ఆగస్టు నెలలో పింఛన్ సొమ్ము ఆపేందుకు కుట్ర జరుగుతున్నట్లు సమాచారం. ప్రజాసేవ చేసేందుకు ప్రజలు అవకాశం కల్పిస్తే.. పేదల పొట్ట కొట్టేందుకు కూటమి నేతలు సిద్ధమయ్యారని ప్రజలు వాపోతున్నారు.



తాము అర్హులమైనా పింఛన్ సొమ్ము ఇవ్వలేదని పుట్టపర్తిలోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రామగిరి మండలానికి చెందిన లబ్ధిదారులు (ఫైల్)

రామగిరిలో నెల రోజులుగా ఇక్కట్లు..

మాజీ మంత్రి పరిటాల సునీత సొంత మండలం రామగిరిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు 210 మందికి జూలై నెలలోనే పింఛన్ ఇవ్వకుండా అడ్డుకున్నారు. రాజకీయాలు తెలియని పండుటాకులు, వృద్ధులు, వితంతువులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో వారంతా కలెక్టరేట్‌కు తరలివచ్చి ధర్నాకు దిగారు. మరుసటి రోజూ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. డీఆర్‌డీఏ పీడీని కలిసి సమస్య ఏమిటని ఆరా తీసినా సరైన సమాధానం లభించలేదు. ఆయా గ్రామ పంచాయతీల్లో టీడీపీ నాయకుల ఒత్తిళ్ల కారణంగా పింఛన్ సొమ్ము పంపిణీ చేయనట్లు తెలుస్తోంది. రామగిరి, ఎంసీ పల్లి, పోలేపల్లి పంచాయతీల ప్రజలు రెండు నెలల పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు.

25 శాతం తొలగించే కుట్ర..

ప్రతి గ్రామంలోనూ ప్రస్తుతం ఉన్న పింఛన్లలో 25 శాతం మేర తొలగించాలని, అందులో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులవి మొత్తం తీసేయాలని స్థానిక టీడీపీ నాయకులు పట్టుబట్టినట్లు అధికారులు చెబుతున్నారు. 'చెప్పినట్లు చేయండి.. లేదంటే వెళ్లిపోండి. మేం వేరే అధికారిని తెచ్చుకుంటాం' అని బెదిరిస్తున్నట్లు వాపోతున్నారు. నిబంధనల ప్రకారమే జాబితా సిద్ధం చేస్తున్నామని చెప్పినా.. వినడం లేదని ఓ మహిళా ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు.

జాబితా సిద్ధం కాలేదు



ఆగస్టు నెలకు సంబంధించిన పింఛన్‌దారుల జాబితా ఇంకా సిద్ధం కాలేదు. పింఛన్ల తొలగింపుపై ఒత్తిళ్లు నా వరకు రాలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జాబితా సిద్ధం చేస్తున్నాం. నెలాఖరుకు తుది జాబితా తయారవుతుంది.

– కేఎస్ నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

జిల్లాలో పలువురు ఎస్‌ఐల బదిలీ



పుట్టపర్తి టౌన్: జిల్లాలోని పలువురు సబ్‌ఇన్‌స్పెక్టర్లు (ఎస్‌ఐ) బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన వారిని తిరిగి ఆయా జిల్లాలకు బదిలీ చేశారు. అలాగే ఎన్నికల సమయంలో జిల్లా నుంచి చిత్తూరు, తిరుపతి జిల్లాకు బదిలీపై వెళ్లిన సబ్‌ఇన్‌స్పెక్టర్లను తిరిగి జిల్లాకు బదిలీ చేస్తూ బుధవారం అనంతపురం రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు.

బదిలీపై వెళ్లిన ఎస్‌ఐల వివరాలు ఇలా...

కదిరి టౌన్ పోలీసు స్టేషన్ పనిచేస్తున్న ఎం.పూర్యానాయక్, ధర్మవరం వన్‌టౌన్‌లో పనిచేస్తున్న ఎం.నారాయణప్ప, దిశ మహిళా పీఎస్‌లో పనిచేస్తున్న సీహెచ్ సరస్వతి, పి. సుమతి, పి. విజయలక్ష్మి, ధర్మవరం టూటౌన్ పీఎస్ నుంచి ఎస్‌వీ రెడ్డెప్ప, కదిరి రూరల్ పీఎస్‌లో ఉన్న కె. యతిరాజులు, హిందూపురం ట్రాఫిక్ స్టేషన్‌లో ఉన్న బి. రెడ్డినాయక్, గోరంట్ల యూపీఎస్ స్టేషన్ నుంచి కె.బాలాజీ, హిందూపురం వన్ టౌన్‌లో ఉన్న నిత్యానంద పిళ్లై, పీఎల్ వసుంధరాదేవి, హిందూపురం టూటౌన్‌లో ఉన్న ఎస్‌కే మారుతి, పుట్టపర్తి సెక్యూరిటీ వింగ్‌లో ఉంటున్న పి.భువనేశ్వరి, హిందూపురం యూపీఎస్‌లో పనిచేస్తున్న గౌరీ శంకర్, పుట్టపర్తి ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎస్.శ్రీదేవిని తిరుపతి జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లాకు బదిలీపై వచ్చిన ఎస్‌ఐలు..

డి.శేషాద్రి, ఎ.వెంకటనారాయణ, ఎస్.వెంకటరాముడు, జి.రామచంద్రయ్య, జి.ఇక్బాల్ కె.మహమ్మద్ రఫీ, ఎస్.ఇసాక్‌బాషా, సి.బాబు, డి.లక్ష్మీనారాయణ, ఎన్.జయరామప్ప, కేఎల్ కళావతి, ఎస్.అబ్దుల్ కలామ్ ఆజాద్, ఎస్.మహమ్మద్ రఫీ, పి.రెడ్డెప్ప, పి.వెంకటరమణ, కె. ఆంజనేయ ప్రసాద్, కె.శివశంకర్, బి.తులశన్న, జి.బాలరాజును చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి బదిలీపై జిల్లాకు వచ్చారు.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



కదిరి తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు గదిని పరిశీలిస్తున్న జేసీ



తనకల్లులో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్



తలుపులలో స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న జేసీ

- రెవెన్యూ సిబ్బందితో జేసీ అభిషేక్ కుమార్
- పలు తహసీల్దార్ కార్యాలయాల ఆకస్మిక తనిఖీ

కదిరి టౌన్/తలుపుల/ఎన్పీకుంట/గాండ్లపెంట /తనకల్లు/నల్లచెరువు/అమడగూరు: ప్రజా సమస్యలను ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యం చేయవద్దని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. ప్రతి అధికారి తన దృష్టికి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. బుధవారం ఆయన ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణతో కలిసి కదిరి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. కదిరి, తలుపుల, ఎన్పీకుంట, గాండ్లపెంట, తనకలు, నల్లచెరువు, పుట్టపర్తి నియోజకవర్గం పరిధిలోని అమడగూరు, నల్లమాడ తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లోని రికార్డు రూములను పరిశీలించి భద్రతపై ఆరా తీశారు. ఆయా కార్యాలయాల్లోని పలు రికార్డులను సైతం పరిశీలించారు. రాత్రి సమయంలో వాచ్‌మెన్లు తప్పనిసరిగా విధుల్లో ఉండేలా చూసుకోవాలని సూచించారు. వీఆర్‌ఓలు కూడా రాత్రి వేళల్లో కార్యాలయాలపై నిఘా ఉంచాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు రోజుల క్రితం మదనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగి రికార్డులన్నీ కాలిపోయిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా నియోజకవర్గంలోని వివిధ తహసీల్దార్ కార్యాలయాల్లోని రికార్డు రూములు పరిశీలిస్తున్నట్లు జేసీ తెలిపారు.

మరుగుదొడ్లు వినియోగంలోకి తేవాలి..

తలుపుల తహసీల్దార్ కార్యాలయ తనిఖీ సమయంలో జేసీ అభిషేక్‌కుమార్..సమీపంలో ఉన్న 'మీ-సేవ' కేంద్రం వద్దకు వెళ్లారు. కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న స్థానికులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ...వివిధ పనులపై గ్రామాల నుంచి జనం మండల కేంద్రానికి వస్తుంటారని, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జేసీకి తెలిపారు. గతంలో టాయిలెట్స్ నిర్మించినా... అవి నిరుపయోగంగా ఉన్నాయన్నారు. స్పందించిన జేసీ వారంలోపు మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

భూ సమస్యలను పరిష్కరించాలి..

భూ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. తనకల్లు తహసీల్దార్ కార్యాలయ తనిఖీ అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో భూ సమస్యలపై ఎక్కువగా అర్జీలు అందుతున్నాయని, వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ జరిపి వాటిని పరిష్కరించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అక్కడే ఉన్న పలువురు రైతులతో జేసీ మాట్లాడారు. ఏవైనా భూ సమస్యలుంటే నేరుగా తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జేసీ వెంట కదిరి తహసీల్దార్ పుల్లారెడ్డి, నల్లచెరువు తహసీల్దార్ రవికుమార్, తనకల్లు తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, గాండ్లపెంట తహసీల్దార్ శ్రావణి, అమడగూరు తహసీల్దార్ రామనాథరెడ్డి, నల్లమాడ తహసీల్దార్ నాగభూషణం, ఆర్‌ఐ అశోక్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

- గాండ్లపెంట తహసీల్దార్ కార్యాలయం అనంతరం మండల కేంద్రానికి సమీపంలోని పౌరసరఫరాల గిడ్డంగిని (స్టాక్ పాయింట్) సందర్శించారు. అక్కడ నిల్వ ఉన్న నిత్యావసర సరుకులను పరిశీలించారు.

ఉల్లాసంగా ఉట్లపరుష



అప్పరాచెరువులో ఏర్పాటు చేసిన ఉట్లమాను (ఇన్‌సెట్) ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

బత్తలపల్లి: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో ఏటా నిర్వహించే ఉట్ల పరుష బుధవారం ఉత్సాహంగా సాగింది. గ్రామంలోని పీర్ల చావిడి ముందు పెద్ద గుంత ఏర్పాటు చేసిన గ్రామ పెద్దలు... అందులో 40 అడుగుల ఉట్లమాను నిలబెట్టారు. గుంతలో బంకమట్టితో పాటు జిగురు పదార్థమైన కలబంద వేశారు. ఉట్లమానుపైకి ఎక్కే ప్రయత్నంలో యువకులు జారుతూ గుంతలోకి పడిపోవడం.. తిరిగి ఉట్లమాను ఎక్కేందుకు ప్రయత్నించడాన్ని జనం ఆసక్తిగా తిలకించారు. ఉట్లమాను పైభాగంలో ఉంచిన బహుమతిని అందుకోవడానికి చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రయత్నించారు. సుమారు 20 మంది వాల్మీకి యువకులు పోటీ పడగా, సూల సాయి విజేతగా నిలిచారు. వేడుకను తిలకించడానికి చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి జనం భారీగా తరలివచ్చారు. వేడుకల్లో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: మండల పరిధిలోని సేవా మందిరంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో మిగులు సీట్లకు (2024-25 విద్యా సంవత్సరం) అర్హులైన దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఆశ్రమ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ సీట్లు అందుబాటులో ఉన్నట్లు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలలోని 150 సీట్ల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్‌ను విడుదల చేశామని, అందులో 53 సీట్లు భర్తీ అయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన 97 సీట్లకు తాజాగా నోటిఫికేషన్ ఇస్తున్నట్లు వెల్లడించారు. సదరం క్యాంపు ద్వారా పొందిన సర్టిఫికెట్‌లో 40 శాతం అంధత్వం ఉన్న వారు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. వివరాలకు 80088 89815, 81434 61434 నంబర్లలో సంప్రదించాలన్నారు.



వైఎస్ జగన్‌ను కలిసిన ఈరలక్కప్ప

అరాచకాలపై గర్జన

పుట్టపర్తి/మడకశిర/హిందూపురం: కూటమి నేతల దౌర్జన్యాలను వైఎస్సార్ సీపీ నేతలు నిరసించారు. అధినేత వైఎస్ జగన్‌కు సంఘీభావం తెలిపారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ ఆధ్వర్యంలో సాగుతున్న అరాచకాలు, అకృత్యాలను నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఢిల్లీలో బుధవారం జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. టీడీపీ దుష్ట పాలనపై నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్యంలో ప్రతీకారానికి, హింసకు తావు లేదన్నారు. రాజ్యాంగ విలువలను హరిస్తూ టీడీపీ హత్యారాజకీయాలకు పాల్పడుతోందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. నేడు టీడీపీ అధికార దాహంతో అకృత్యాలను ప్రోత్సహిస్తోందని ధ్వజమెత్తారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు సర్కార్ రాష్ట్రంలో సాగిస్తున్న దమనకాండను అడ్డుకోవాలని కోరారు.



ధర్నా వేదిక వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ తదితరులు



సేవ్ డెమొక్రసీ అంటూ ప్లకార్డు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ 'పురం' నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక

మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక తదితరులు పార్టీ శ్రేణులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. ధర్నా అనంతరం మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఢిల్లీలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి అధినేతను కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు, పార్టీ నాయకులపై జరిగిన దాడుల గురించి వివరించారు.



ధర్నాలో పెద్దారెడ్డితో కలిసి పాల్గొన్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

క్లుప్తంగా

లేపాక్షిని సందర్శించిన జపాన్ ప్రొఫెసర్లు



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న ప్రొఫెసర్లు యోషికా ఓగావ, యోహై

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని బుధవారం ఉదయం జపాన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఐజూ అసోసియేట్ ప్రొఫెసర్లు యోషికా ఓగావ, యోహై సందర్శించారు. వీరికి అర్చకులు స్వాగతం పలికి, ఆలయ విశేషాలు వివరించారు. అనంతరం దుర్గాదేవి, వీరభద్ర స్వాముల వారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతకు పెద్దపీట : డీఆర్ఎం



రైల్వే మంత్రి వీసీలో పాల్గొన్న డీఆర్ఎం, ఏడీఆర్ఎం

గుంతకల్లు: రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పన, భద్రతకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేసినట్లు తెలుస్తోందని డీఆర్ఎం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. 2024–25 రైల్వే బడ్జెట్‌పై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం న్యూఢిల్లీలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. గుంతకల్లు డీఆర్ఎం కార్యాలయం నుంచి డీఆర్ఎం విజయ్‌కుమార్, ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ... ఈ ఏడాది బడ్జెట్‌లో డివిజన్‌కు ఆశించిన స్థాయిలోనే నిధులు, కొత్త ప్రాజెక్టులు మంజూరు అయ్యే అవకాశం ఉందన్నారు. నేడో, రేపో విడుదల చేసే పింక్‌బుక్‌లో గుంతకల్లు డివిజన్‌కు ఎంత మొత్తం నిధులు విడుదలయ్యేది తెలుస్తుందన్నారు. అలాగే కొత్త ప్రాజెక్టుల మంజూరు అంశంపై స్పష్టత వస్తుందన్నారు.

ఈ-క్రాప్‌పై నీలినీడలు



- పంట నమోదుపై ఇంకా ప్రకటన చేయని చంద్రబాబు సర్కార్
- గత ప్రభుత్వంలో అత్యంత పారదర్శకంగా పంట నమోదు
- ఈ-క్రాప్ ప్రామాణికంగా రైతులకు విరివిగా ప్రయోజనాలు
- ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ, సున్నావడ్డీ తదితర ఫలాలు



చిలమత్తూరు వద్ద మెట్ట భూమిలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట

హిందూపురం అర్బన్/అనంతపురం అగ్రికల్చర్: కులమతాలు, పార్టీలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి రైతుకూ ఎంతో ప్రయోజనకారిగా ఉన్న ఈ-క్రాప్ (పంట నమోదు) వ్యవస్థపై నీలినీడలు కమ్ముకున్నాయి. నెలన్నర కిందట ఏర్పాటైన చంద్రబాబు సర్కార్ దీనిపై ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికే ఖరీఫ్ ఆరంభమై రెండు నెలలు కావస్తోంది. అరకొర వర్షాలకు మందకొడిగా ఏరువాక కొనసాగుతోంది. సాగు చేసిన అన్ని రకాల వ్యవసాయ, ఉద్యాన పంటల వివరాలు ఈ-క్రాప్ కింద ఆన్‌లైన్ చేయాల్సివుంది. సాగు చేసిన ప్రతి పంట పొలాలను ఈ-క్రాప్ బుకింగ్ చేయడంతో పాటు సదరు రైతుల బయోమెట్రిక్‌తో ఈకేవైసీ చేయాల్సివుంది. ఏటా జూలై రెండో పక్షం నుంచి ప్రత్యేక యాప్ ద్వారా మొదలు పెట్టి సెప్టెంబర్ ఆఖరు వరకు కొనసాగిస్తూ వచ్చారు. పారదర్శకంగా ఉండటంతో రైతులు కూడా పంట నమోదుకు బాగా అలవాటుపడ్డారు. అయితే వ్యవసాయశాఖ ఇప్పటి వరకూ పంట నమోదు ప్రక్రియ చేపట్టక పోవడంతో ఈ-క్రాప్ బుకింగ్, ఈకేవైసీపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ-క్రాప్ లేకపోతే పంటల వారీగా ఖచ్చితమైన సాగు విస్తీర్ణం, వాటికి అనుగుణంగా విత్తన ప్రణాళికలు, పంటల వైవిధ్యం, పథక నిర్దేశన చేయడం కూడా కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, జిల్లా వ్యాప్తంగా రైతులు ముందస్తుగా సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న పంటల్లో కలుపు తీత మొదలైంది. పంట పెట్టి నెల రోజులకు పైగా కావస్తునా... ఈ క్రాప్, ఈకేవైసీపై ఎలాంటి ప్రకటన లేకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పెట్టుబడి సాయంపై కూడా స్తబ్ధత నెలకొంది.

జిల్లాలో మొత్తం వ్యవసాయ భూమి	సాధారణ సాగు విస్తీర్ణం	ఇప్పటికే సాగయిన విస్తీర్ణం
2,89,601 హెక్టార్లు	2,44,763 హెక్టార్లు	1,03,327 హెక్టార్లు

ప్రశంసలు అందుకున్న ఈ-క్రాప్..

గత ఐదేళ్ల అధికారంలో ఉన్న జగన్ సర్కార్... దేశంలో మరెక్కడా లేని విధంగా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. గ్రామ గ్రామాన ఆర్‌బీకే వ్యవస్థ ఏర్పాటు చేసిన అదే వేదికగా గ్రామం దాటి వెళ్లే అవసరం లేకుండా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ అందించేలా చర్యలు తీసుకుంది. అలాగే సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేపట్టి దాని ఆధారంగా రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహక రాయితీలు, పథకాలు వర్తింపజేసింది. దీంతో అర్హత కలిగిన ప్రతి రైతూ ప్రయోజనం పొందారు. ఈ కార్యక్రమం అత్యంత పారదర్శకంగా చేపట్టడంతో దేశంలో పలు రాష్ట్రాలు సైతం ఈ-క్రాప్ వ్యవస్థను మెచ్చుకున్నాయి.

నాడు రూ.కోట్లలో లబ్ధి..

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతే ఈ-క్రాప్ ఆధారంగా ఉమ్మడి జిల్లాలో అర్హత కలిగిన రైతులకు రూ.485 కోట్ల మేర పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్‌సబ్సిడీ)ని అప్పట్లో జగన్ సర్కార్ అందజేస్తూ వచ్చింది. ఉచిత పంటల బీమా పథకంతో గుర్తించిన పంటలు సాగు చేసిన రైతులకు బీమా పరిహారం కింద అత్యధికంగా రూ.1,883 కోట్ల పరిహారం అందించారు. పండించిన పంటలకు బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోతే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో నోడల్ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేశారు. ఈ లెక్కన రూ.280 కోట్లు విలువ కలిగిన వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసి రైతులకు లబ్ధి చేకూర్చారు. అలాగే బ్యాంకుల ద్వారా రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులకు ఈ-క్రాప్ ఆధారంగా పంట రుణాల సున్నా వడ్డీ పథకం కింద రూ.156 కోట్ల మేర వడ్డీ జమ చేశారు. ఖరీఫ్, రబీలో విత్తన పంపిణీకి వీలుగా రైతుల నుంచి గిట్టుబాటు ధరతో విత్తన సేకరణ చేశారు. ఇలా గత ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలకు ఈ-క్రాప్‌నే ప్రామాణికం కావడం గమనార్హం. ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని కొనసాగించాల్సిన చంద్రబాబు సర్కార్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

తీవ్రంగా నష్టపోతాం



ఈ క్రాప్ నమోదు సకాలంలో చేయాలంటూ గత ప్రభుత్వంలో వ్యవసాయాధికారులు మా వెంటపడేవారు. మా సంక్షేమం కోసం అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధి కనబరిచిందో ఈ ఒక్క ఉదాహరణ చాలు. ఈ ఖరీఫ్‌లో ఇప్పటి వరకూ ఎలాంటి పెట్టుబడి సాయాన్ని ఈ ప్రభుత్వం అందించలేదు. పైగా ఈ క్రాప్ నమోదు ఎప్పుడు చేస్తారనేది కూడా చెప్పడం లేదు. చంద్రబాబు ప్రభుత్వ తీరుతో చాలా నష్టపోనున్నాం.

– ఫక్రుద్దీన్, రైతు, చిలమత్తూరు

రైతులను ఆదుకోవాలి



పంట సాగు చేసి నెల రోజులకు పైగా అవుతోంది. ఇప్పటి వరకూ ఈ క్రాప్ గురించి ఏ అధికారీ మాట్లాడడం లేదు. గత ఏడాది ఈ పాటికి మా వెంట పడి మరీ ఈ క్రాప్ నమోదు పూర్తీ చేశారు. వర్షాభావం తీవ్రంగా నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో పంట దిగుబడులపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఇలాంటి దశలో ఈ-క్రాప్ ఒక్కటే మమ్మల్ని ఆదుకుంటుంది. ప్రభుత్వ పెద్దలు వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలి.

– నరసప్ప, మరవకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

మానవత్వం చాటుకున్న సబ్ కలెక్టర్



సపర్యల తర్వాత కోలుకున్న కిరణ్‌కుమార్

గుడిబండ: జిల్లా సబ్ కలెక్టర్ అపూర్వభరత్ మానవత్వాన్ని చాటుకున్నారు. గుడిబండలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసేందుకు బుధవారం వస్తున్న ఆయన మార్గం మధ్యలో రహదారిపై పడిపోయిన ద్విచక్ర వాహనదారుడిని ఆదుకుని, సకాలంలో ఆస్పత్రికి చేర్చారు. వివరాలు... హిందూపురం మండలం కిరికెర గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్.. బుధవారం ఉదయం అమరాపురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గం మధ్యలో ఫిట్స్ రావడంతో రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో అటుగా వస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తన వాహనాన్ని ఆపి కిరణ్‌కుమార్‌కు సపర్యలు చేపట్టారు. కాస్త కోలుకున్న తర్వాత ఆయనను గుడిబండ పీహెచ్‌సీకి తరలించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కిరణ్‌కుమార్ ప్రాణాలు కాపాడిన సబ్ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రైలు ఢీకొని గొర్రెలు మృతి

ధర్మవరం అర్బన్: స్థానిక ఇందిరమ్మకాలనీ సమీపంలో రైలు ఢీకొని 38 గొర్రెలు మృతి చెందాయి. కేతిరెడ్డికాలనీకి చెందిన కాపరి నారాయణప్ప బుధవారం సాయంత్రం తన గొర్రెలను పట్టాల వద్ద మేపునకు వదిలాడు. ఆ సమయంలో పట్టాలు దాటుతున్న గొర్రెలను రైలు ఢీకొంది. ఘటనలో 38 గొర్రెలు మృతి చెందడంతో దాదాపు రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు.

వివాహిత ఆత్మహత్య



మృతురాలు స్వాతి

కూడేరు: మండలంలోని కలగళ్లకు చెందిన ఎర్రిస్వామి భార్య స్వాతి(32) ఆత్మహత్య చేసుకుంది. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పులు చేసి పంటల సాగు చేపట్టారు. అయితే వర్షాభావ పరిస్థితుల్లో పంటల దిగుబడి లేక నష్టపోయారు. దీంతో అప్పుల భారం పెరిగింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదంటూ బాధపడుతున్న భర్తను చూసి మనస్తాపం చెందిన ఆమె మంగళవారం ఊజీ మాత్రలు మింగింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అదే రోజు రాత్రి ఆమె మృతి చెందింది. ఘటనపై కూడేరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

అనంతపురం: మూడేళ్ల చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించిన బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగర శివారులోని ఓ కాలనీకి చెందిన దంపతులు భవన నిర్మాణ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. రోజూ తమ మూడేళ్ల వయసున్న చిన్నారిని కూడా పని ప్రాంతానికి తీసుకెళ్లేవారు. ఈ క్రమంలో పని ప్రాంతం వద్ద చిన్నారి ఆడుకుంటూ ఉండగా ఓ మైనర్ బాలుడు చాక్లెట్ ఆశ చూపి తన వెంట భవనం పక్కకు తీసుకెళ్లి అఘాయిత్యం చేయబోయాడు. అదే సమయంలో పాప కనిపించడం లేదని వెతుకుతూ భవనం కిందకు చేరుకున్న తల్లిదండ్రులకు సమీపంలోని నిర్జన ప్రదేశం నుంచి ఏడుపు వినిపించింది. వెంటనే వారు అక్కడకు చేరుకుని పాపను కాపాడారు. మైనర్ బాలుడి అసభ్య ప్రవర్తనపై మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి బాలుర పరివర్తనా కేంద్రానికి తరలించారు.

ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలు పరిష్కరించండి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు



జెడ్పీ సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం జిల్లా పరిషత్ సీఈఓ ప్రభాకరరావుకు ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఖాతాల్లో నెలవారీగా ఎంత నగదు, ఎంత వడ్డీ జమ అయిందో వివరాలు తెలియక ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారన్నారు. పార్ట్ ఫైనల్ రుణాలు, ఇతర రుణాల కోసం నెలల తరబడి వేలాది మంది ఉపాధ్యాయులు జెడ్పీ చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇతర జిల్లాల్లో వార్షిక ఖాతా నిలువలను విడుదల చేసినా ఒక్క అనంతపురం జిల్లాలో మాత్రమే వార్షిక ఖాతా నిలువలను విడుదల చేయకుండా ఖాతాలను స్తంభింప చేయడం బాధాకరమన్నారు. పీఎఫ్ సెక్షన్ ఖాతా నిలువ నవీకరణ సమాచారం తక్షణమే విడుదల చేయాలన్నారు. సీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, సీనియర్ నాయకులు కె.పాతిరెడ్డి, ఎం. కిష్టప్ప, రామాంజనేయులు, తిప్పేస్వామి ఉన్నారు.

బోరు బావి ధ్వంసం



పైపులు పగులగొట్టిన దృశ్యం

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఎద్దుల ప్రకాష్‌రెడ్డికి చెందిన వ్యవసాయ తోటలోని బోరు బావిని దుండగులు ధ్వంసం చేశారు. బాధితుడు తెలిపిన మేరకు... గ్రామ సమీపంలోని వీరాలమ్మ గుడి వద్ద ప్రకాష్‌రెడ్డికి 8 ఎకరాల పొలం ఉంది. ఇందులో 4 ఎకరాల్లో 600 చీనీ చెట్లు, మరో 4 ఎకరాల్లో టమాట పంట సాగు చేపట్టాడు. గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చురుకైన కార్యకర్తగా ఉంటున్న ఆయనపై స్థానిక టీడీపీ నేతలు కక్ష కట్టారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తోట వద్ద కాపలా ఎవరూ లేరన్న విషయం తెలుసుకున్న దుండగులు బోరు బావిని ధ్వంసం చేశారు. పైప్ లైన్‌ను పగులగొట్టారు. దీంతో దాదాపు రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

రైలు కిందకు దూరి మహిళకు గాయాలు

గార్లదిన్నె: ప్రమాదవశాత్తు రైలు కిందకు దూరి ఓ మహిళ గాయపడింది. వివరాలు... గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన నల్లమ్మ బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ కింద నుంచి అవతలి వైపునకు చేరుకునేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో గూడ్స్ ముందుకు కదలడంతో ప్లాట్‌ఫాంపై ఉన్న వారు గట్టిగా కేకలు వేయడంతో లోకో పైలెట్ వెంటనే రైలును ఆపేశాడు. గాయపడిన నల్లమ్మను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు వినోద్‌కుమార్

అనంతపురం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం శివారులోని రాజీవ్ కాలనీకి చెందిన వినోద్‌కుమార్ (34) బుధవారం వేకువజాము 2 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వెళుతూ సైపుల్లా బ్రిడ్జి వద్ద అదుపు తప్పి కిందపడ్డాడు. అటుగా వెళుతున్న వారు గమనించి వెంటనే క్షతగాత్రుడిని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వినోద్ కుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్రంలో అమ్మాయిలకు రక్షణ కరువు



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి ఉంచి ఆడపిల్లలు, మహిళలకు రక్షణ కరువైందని, వారిపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ ధ్వజమెత్తారు. విద్యార్థినులపై దాడులు అరికట్టాలని, నిర్భయ చట్టాన్ని అమలు చేయాలంటూ వివిధ కళాశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థినులు బుధవారం గుంతకల్లులో భారీ ర్యాలీ చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ నుంచి గాంధీచౌక్ వరకూ ర్యాలీ కొనసాగింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఈ 50 రోజుల్లోనే చిన్నారుల, మహిళలపై అనేక అఘాయిత్యాలు చోటు చేసుకున్నాయని ఈ సందర్భంగా వక్తలు మండిపడ్డారు. ముచ్చుమర్రిలో అదృశ్యమైన బాలిక ఆచూకీని కనుక్కోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. విద్యార్థినులు, మహిళల రక్షణకు నిర్భయ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని, లేకుంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా బాలిక విభాగం కన్వీనర్ రజిత, పవిత్ర, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వివాహిత గొంతు కోసిన దుండగులు

కంబదూరు: మండలంలోని మర్రిమాకులపల్లికి చెందని వివాహిత భానుప్రియపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి, బ్లేడుతో గొంతు కోశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... మర్రిమాకులపల్లికి చెందిన సుధాకర్... శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు ప్రాంతానికి చెందిన భానుప్రియను ప్రేమించి, ఏడాది క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. భానుప్రియకు తల్లిదండ్రులిద్దరూ లేరు. దీంతో పిన్నమ్మనే పెంచి పెద్ద చేసింది. అయితే సుధాకర్‌ను పెళ్లి చేసుకున్నప్పటి నుంచి ఆమెను గుర్తు తెలియని వ్యక్తులు బెదిరిస్తూ వచ్చారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న భానుప్రియపై మాస్కులు ధరించిన వ్యక్తులు దాడి చేశారు. బ్లేడ్‌తో గొంతు కోసి పరారయ్యారు. గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో నిందితుల గ్రామ బహిష్కరణ



వెల్దుర్తిలో నిందితుడి దుకాణాన్ని ధ్వంసం చేస్తున్న గ్రామస్తులు

చెన్నేకొత్తపల్లి: శాంతియుత వాతావరణంలో ఎంతో సఖ్యతగా జీవిస్తున్న తమ గ్రామంలో హంతకులకు, వారి కుటుంబసభ్యులకు చోటు లేదని, వెంటనే గ్రామం విడిచి వెళ్లాలంటూ చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తి గ్రామస్తులు తీర్మానించారు. ఆ మేరకు ఆటో డ్రైవర్ చాకలి సూర్యనారాయణ హత్య కేసులో నిందితుల కుటుంబసభ్యులను గ్రామ బహిష్కరణ చేశారు. వివరాలు... ఈ నెల 20న ఆస్తి వివాదంలో చాకలి సూర్యనారాయణను సమీప బంధువులే హతమార్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే వెల్దుర్తికి చెందిన మల్లికార్జున, లక్ష్మీనారాయణ, రాము, రాజును పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో గ్రామస్తులు మూకుమ్మడిగా చర్చించుకున్నారు. ఇతర గ్రామం నుంచి వచ్చి వెల్దుర్తిలో స్థిరపడి హత్యలు, దౌర్జన్యాలకు పాల్పడుతూ గ్రామానికి చెడ్డ పేరు తీసుకురావడం సరికాదన్నారు. అలాంటి వారిని గ్రామంలో ఉండటానికి వీలు లేదన్నారు. ఇల్లరికానికి వచ్చిన వ్యక్తిని హతమార్చడం సహించరాని నేరంగా పరిగణించారు. హంతకులు గ్రామంలో ఉంటే ఇతరులు కూడా అదే పనిచేసే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తూ హత్య కేసులో నిందితుల ఇళ్ల వద్దకెళ్లి వారి కుటుంబసభ్యులను వెంటనే గ్రామం వదిలి వెళ్లాలని సూచించారు. వారికి సంబంధించిన దుకాణాన్ని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న చెన్నేకొత్తపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు వెంటనే వెల్దుర్తికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

దళితులపై టీడీపీ నేతల దాడి

- ముగ్గురు మహిళలు, మరో వ్యక్తికి గాయాలు
- మారాల ఎస్సీ కాలనీలో ఘటన



టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన మారాల ఎస్సీ కాలనీకి చెందిన దళితులు

పుట్టపర్తి: కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి దాకా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై టీడీపీ నాయకుల దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా బుధవారం బుక్కపట్నం మండలం మారాల ఎస్సీ కాలనీ వాసులైన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడులకు పాల్పడ్డారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లతో దాడికి దిగారు. దీంతో దళితులైన చిన్నాగమ్మ, లక్ష్మీదేవి, భవాని, ఓబులప్పలకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారికి మూగ దెబ్బలు తగిలాయి. బాధితులు బుక్కపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో పీర్ల పండుగ నేపథ్యంలో దాడులు చేయాలని టీడీపీ నాయకులు కుట్ర పన్నారు. మూడు రోజులుగా కవ్వింపు చర్యలకు పాల్పడుతూ వచ్చారు. అయినా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఓపికగా ఉన్నారు. అయినప్పటికీ బుధవారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నారాయణస్వామి, సందీప్, గౌతమ్ తదితరులు దాడికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. దళితులపై టీడీపీ నేతల దాడిని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఈదులపల్లి రామమోహన్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులను నిరాశపర్చిన బడ్జెట్

- రుణమాఫీ, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం ప్రతిపాదన లేదు
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: బడ్జెట్‌లో వ్యవసాయానికి అరకొర నిధులు కేటాయించి రైతులను కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిరాశకు గురిచేసిందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. వ్యవసాయ రుణాలమాఫీ, మద్దతు ధరల గ్యారెంట్ చట్టం ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. ఆ సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ ప్రవేశపెట్టిన రూ.48 లక్షల కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు కేవలం రూ.1.52లక్షల కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. దేశంలో 60 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడ్డారన్నారు. ఇలాంటి రంగానికి బడ్జెట్‌లో కనీసంగా 10 శాతం నిధులు కేటాయించాలన్నారు. విదేశీ కార్పొరేట్ కంపెనీలకు పన్ను రాయితీలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం డ్రిప్, స్ప్రింకర్లపై జీఎస్టీ రద్దుపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఫసల్ బీమా పథకానికి గత ఏడాది కంటే రూ.400 కోట్లు తగ్గించారన్నారు. ఎరువుల సబ్సిడీకి గత ఆర్థిక సంవత్సరంలో రూ. 1.88 లక్షల కోట్లు కేటాయిస్తే ప్రస్తుతం రూ.1.64 కోట్లు కేటాయించారన్నారు. దీనివల్ల ఎరువుల ధరల పెరిగే ప్రమాదం ఉందన్నారు. నూనె గింజలు, పప్పుధాన్యాలు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధిస్తామని చెబుతూనే విదేశీ దిగుమతులపై సుంకాలను పూర్తిగా ఎత్తివేయడం దేశీయ వ్యవసాయాన్ని దెబ్బతీసేందుకేనని అర్థమవుతోందన్నారు. బడ్జెట్‌లో కౌలు రైతులను పూర్తిగా విస్మరించారన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టోయిన రైతులను ఆదుకునేందుకు నిధుల కేటాయింపులు లేవన్నారు. మొత్తానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులను పూర్తిగా నిరాశపరిచిందన్నారు.